నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025 Happy new Year

క్లుప్తంగా

ప్రముఖుల శుభాకాంక్షలు

హన్మకొండ చౌరస్తా : యావత్ తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే కాంగ్రెస్ సర్కార్ సంకల్పం. నూతన సంవత్సరంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తాం. కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

2024లో ఎదురైన అనుభవాలను సానుకూలంగా మల్చుకుని, 2025 నూతన సంవత్సరంలో మరింత పట్టుదల, కృషితో ఎలాంటి సవాళ్లనైనా దీటుగా ఎదుర్కొని విజయాలను కైవసం చేసుకోవాలి. . కొత్త సంవత్సరంలో నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలను చేసుకోవడంతో పాటు పేద వర్గాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించబోతున్నాం.

– కడియం శ్రీహరి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే

నేటి నుంచి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జనవరి 1నుంచి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు మోటార్ వెహికల్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ జైపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో రోడ్డు భద్రతా జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు

● రాష్ట్ర కార్యదర్శిగా సోమశేఖర్


కె.సోమశేఖర్


డి.కిరణ్‌కుమార్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ మహాసభల్లో నూతన కమిటీలో హనుమకొండ జిల్లా నుంచి ఇద్దరి ఉపాధ్యాయులకు చోటు లభించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు నల్లగొండ జిల్లా కేంద్రంలో ముగిశాయి నూతన కమిటీని ఎన్నికున్నారని, ఇద్దరికి చోటులభించినట్లు మంగళవారం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు తెలిపారు. టీఎ స్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు కె.సోమశేఖర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులుగా ఇదే జిల్లాకు చెందిన డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. సోమశేఖర్ ధర్మసాగర్ మండలం మల్లక్‌పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌గాను, డి.కిరణ్‌కుమార్ హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హెస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. వీరి ఎన్నికపై హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవీందర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు హర్షం వ్యక్తం చేశారు.

ఏపీఓల జిల్లా అధ్యక్షుడిగా కుమారస్వామి

హన్మకొండ అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారులు (ఏపీఓ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా భీమదేవరపల్లి ఏపీఓగా పనిచేస్తున్న పెరుమాండ్ల కుమారస్వామి ఎన్నికయ్యారు. డీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లాలోని ఏపీఓల సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నలుమాసుల రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నక్క కుమారస్వామి, ఉపాధ్యక్షురాలుగా కీర్తి అనిత, కోశాధికారిగా మార్క సంపత్, సహాయ కార్యదర్శిగా కలకట్ల విజయలక్ష్మి, ఈసీ సభ్యులుగా మార్త ఇందిర, కె.విజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డీఆర్డీఏ పీడీ మేన శ్రీనును జిల్లా నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతీయ వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా చంద్రశేఖర్



కాజీపేట: సార్క్ నేషన్స్ ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ వర్కింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎలిగేటి చంద్రశేఖర్ నియమితులయ్యారు. కాజీపేట పట్టణానికి చెందిన చంద్రశేఖర్ ప్రస్తుతం జాతీయ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఈమేరకు ఆయనకు వ్యవస్థాపక జాతీయ చైర్మన్ గడిపె ప్రశాంత్ మంగళవారం నియామక పత్రం అందజేశారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ టోర్నీకి అక్రమ్ ఖాన్



వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల కబడ్డీ టోర్నమెంట్‌కు హనుమకొండ బొక్కలగడ్డకు చెందిన మహ్మద్ అక్రమ్ ఖాన్ ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం హనుమకొండ హెడ్‌పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పోస్టాఫీస్ సూపరింటెండెంట్ హనుమంతు నాయక్, పోస్ట్ మాస్టర్ పవన్, కోచ్ వెంకటేశ్ గౌడ్ అభినందించారు.

ఫోర్ట్‌రోడ్డుపై ప్రధాన పైపులైన్ లీకేజీ

● డ్రెయినేజీ పాలవుతున్న తాగునీరు
● మరమ్మతులు చేయాలంటున్న స్థానికులు


ఫోర్ట్‌రోడ్డు హనుమాన్ జంక్షన్‌లో లీకవుతున్న తాగునీటి పైపులైన్


రోడ్డుపై పారుతున్న తాగునీరు

వరంగల్ ఫోర్ట్‌రోడ్డు హనుమాన్ జంక్షన్‌లోని సులభ్ కాంప్లెక్స్ సమీపంలో తాగునీటి ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దాంతో ఫోర్ట్‌రోడ్డుపై మంగళవారం ఉదయం తాగునీరు వరదలా ప్రవహించింది. లక్షల లీటర్ల తాగునీరు డ్రెయినేజీ పాలవుతోందని బల్దియా అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రధాన పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఖిలా వరంగల్

శ్వేతార్కుడికి పుష్పాభిషేకం

కాజీపేట: శ్వేతార్క మూలగణపతి క్షేత్రంలో పండితులు మంగళవారం పుష్పాభిషేకం నిర్వహించారు.

పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలి

● వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

కాశోజీ సెంటర్: జిల్లాలో పంట మార్పిడికి ప్రాధాన్యం ఇచ్చేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన హార్టికల్చర్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఫిషరీస్, అగ్రికల్చర్ అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, మిరప, డ్రైఫ్రూట్స్, కూరగాయలు, పండ్లు, పూల తోటలు, పచ్చిరొట్ట పంటల కోసం 2,88,486 ఎకరాల భూమి ఉందని తెలిపారు. జిల్లా ప్రణాళిక శాఖ అధికారి గోవిందరాజన్, వరంగల్ నర్సంపేట, ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఉద్యాన శాఖ అధికారి సంగీత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీసీపీ రవీందర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.నాగార్జునరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం


ధర్నా చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర రామస్వామి, మాలోత్ సాగర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ కరీమాబాద్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం గతం కన్నా మరింత దూకుడుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని డిస్కంలను ప్రైవేట్ పరం చేసే యత్నాలు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేతలు మహబూబ్ పాషా, ఓదెలు, ఇస్మాయిల్, రతన్ గౌడ్, రాఘవరెడ్డి, జుబేదా, జహేదా, మాదాసు దివ్య, యాకమ్మ, యాకుబ్‌పాషా, సూరయ్య, జహీదా, స్వరూప, పెంటయ్య విమల, కిష్టయ్య, సాంబయ్య, నాగరాజు, షరీఫ్, రంజిత్ పాల్గొన్నారు.

హనుమకొండలో ఎగ్జిబిషన్ ప్రారంభం

హన్మకొండ అర్బన్: బాలసముద్రంలోని హయగ్రీవ చారి మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ యజమాని అస్లాం మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఇటాలియన్ టైప్ అమ్యూజ్‌మెంట్ పార్కు, దేశంలోని భిన్న సంస్కృతులను ప్రతిబింబించే రాజస్థాన్, లక్నో, హర్యానా, మరెన్నో రాష్ట్రాల కలంకారీ, చేనేత, ఫ్యాన్సీ బ్యాంగిల్స్, ఇమిటేషన్ జువెల్లరీ, లెదర్ గూడ్స్, రుచికరమైన కలకత్తా చాట్ బండార్, సిమ్లా మిర్చి, ఢిల్లీ పాపడాలు, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్, ఇలా సుమారు 100కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు అజీజ్ మీర్జా, మేనేజర్లు డి.రాజేంద్రప్రసాద్, ఫిరోజ్, స్థానిక కార్పొరేటర్ రావుల కోమల, 5వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

రక్షణ రంగంలో ఉద్యోగావకాశాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్నల్ రామదురై

● ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ రామదురై

విద్యారణ్యపురి: రక్షణ రంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని 10వ కంపెనీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎస్ రామదురై అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని గణితశాస్త్ర విభాగ సెమినార్‌హాల్‌లో విభాగం అధిపతి డాక్టర్ భారవీశర్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో మిలటరీలోని ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఎన్‌డీఏ, సీడీఎస్ పరీక్షల విధానంపై అవగాహన కల్పించారు. మేజర్ సుబేదార్ రఫీతో కలిసి విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమంలో గణిత విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్, డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ బీఎల్.సౌజన్య, డాక్టర్ సోమయ్య, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ సుమతి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం పెంపొందుతుంది

హసన్‌పర్తి: విద్యతోనే వికాసం చేకూరుతోందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కుంజాపురం దామోదర్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేట పాఠశాలలో 'సంస్కార వికాస' శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పారు. పరీక్షలు ఉన్నాయని హడావుడిగా పడడంకంటే మొదటి నుంచే క్రమపద్ధతిలో శ్రద్ధగా చదివితే ఎలాంటి ఒత్తిడి ఉండదని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు అజీమ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి



ఖిలా వరంగల్: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు కివీ పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి తెలిపారు. కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో కివీ పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ దాసి రజిని ఆధ్వర్యంలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు 103 రకాల రుచికరమైన వంటకాలు ప్రదర్శించగా.. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. ఉపాధ్యాయులు రవితేజ, రంజిత పాల్గొన్నారు.

'తేజస్'లో ఘనంగా గెట్ టు గెదర్



కాజీపేట అర్బన్: తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థుల గెట్ టు గెదర్ కార్యక్రమం హంటర్‌రోడ్డులోని టీవీఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రారంభించి 15 ఏళ్ల కాలంలో అనేక మంది తమ విద్యార్థులు ఐఐటీ, నీట్‌లలో సీట్లు సాధించి ఉన్నత స్థాయిలో ఉన్నారని కళాశాల డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాంబాబు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సతీష్, విద్యాసాగర్, శ్రీపాల్, కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో దీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సీపీ అంబర్ కిషోర్‌ఝా ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు ఉమాకాంత్, ఐలయ్య, ఏఆర్ఎస్సైలు శ్రీనివాస్, పద్మారావు కానిస్టేబుళ్లకు సీపీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్ ఏసీపీ అనంతయ్య, ఆర్‌లు సతీశ్, స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, ఆర్ఎస్సై శ్రవణ్, పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.27 లక్షల బీమా చెక్కు అందజేత

ఖిలా వరంగల్: గత జులై 7న ఆత్మహత్యకు పాల్పడిన అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి రూ.27,26,067 విలువగల బీమా చెక్కును అందజేశారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ సొమ్మును మృతుడి భార్య కృష్ణవేణికి వరంగల్ తపాలాశాఖ కార్యాలయంలో తపాలాశాఖ సూపరింటెండెంట్ బంగారం రవికుమార్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాముల కృష్ణ, లౌక్యశ్రీ, గోవర్దన్, అనిల్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

బస్టాండ్, రైల్వే స్టేషన్లలో పోలీసుల తనిఖీలు

వరంగల్ క్రైం: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు హనుమకొండ బస్టాండ్, కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. యాంటీ డ్రగ్స్‌టీం పోలీసులు, డాగ్ స్క్వాడ్, స్థానిక పోలీస్ అధికారులు కలిసి అనుమానిత ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఆర్‌ఐ శివకేశవులు, కాజీపేట, హనుమకొండ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట పట్టణంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. సీఐలు సుధాకర్ రెడ్డి, నాగబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాయుధ పోలీసుల ఆధ్వర్యంలో అధికారులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలతో పాటు హైస్పీడ్‌గా నడుపుతున్న వాహనాలను పట్టుకున్నారు.

సంక్షిప్తంగా

కేయూ ఉద్యోగ సంఘం నేత అయిలయ్య మృతి


అయిలయ్య (ఫైల్)

కేయూ క్యాంపస్: కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ (ఎంఈఎఫ్) నర్మెట్ట అయిలయ్య (45) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్టోర్ కీపర్‌గా పనిచేస్తూ కేయూ ఉద్యోగుల క్వార్టర్స్‌లో కుటుంబంతో నివాసముంటున్న అయిలయ్య.. సోమవారం రాత్రి అస్వస్థతకు గురికాగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మరణించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై మాలధారుల దాడి దారుణం

కాజీపేట అర్బన్: దళిత ఉపాధ్యాయుడిపై అయ్యప్ప మాలధారుల దాడి దారుణమని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ విమర్శించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు.. పాఠాలు బోధిస్తున్న తరుణంలో అయ్యప్ప మాల వేసుకున్న 9వ తరగతి విద్యార్థికి కాలు తాకిందనే సాకుతో హెచ్ఎంపై మాలధారులు దాడి చేసి, విద్యార్థి కాళ్లు మొక్కించడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో పండ్ల పంపిణీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను దత్తత తీసుకుని అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కృపాకర్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నెల రోజుల పాటు పండ్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమం మంగళవారం ముగియగా, క్లబ్ అధ్యక్షుడు కృపాకర్ మాట్లాడుతూ పాఠశాలకు కుర్చీలు కూడా సమకూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నాగమళ్ల సుధీర్, చిలగాని మోహన్, తోట సంపత్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మకాలనీ మహిళా కమిటీ ఎన్నిక

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ 44వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ కాంగ్రెస్ మహిళా కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా బొబ్బిలి ప్రశాంతి, ఉపాధ్యక్షురాలిగా మండల నవ్య, ప్రధాన కార్యదర్శిగా బానోతు శిరీష, కార్యదర్శిగా బండి శైలజ, జాయింట్ సెక్రటరీగా నర్మెట మమత, కోశాధికారిగా బండి జ్యోతిని ఎన్నుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతి చెందిన భీమారానికి చెందిన పసులూటి విజయ్ అంత్యక్రియలకు స్థానికుడు తోట రమేష్ ఆర్థిక సాయం చేశారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులకు రూ.30 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు భార్గవ్, రాజు, పున్నం, రాకేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

హరియాణా మద్యం పట్టివేత

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో థర్డ్ ప్లాట్ ఫారంపై మండల ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహించారు. హరియాణా రాష్ట్రానికి చెందిన 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు విశ్వకల్యాణ మహోత్సవం

హన్మకొండ కల్చరల్: శ్రీశాంతిసేవా సమితి ఆధ్వర్యంలో విశ్వకర్మ పరమేశ్వరుల విశ్వకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శ్రీశాంతిసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శాంతికృష్ణ ఆచార్య తెలిపారు. వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

4, 5వ తేదీల్లో పారిశుద్ధ్య పనులు బంద్

వరంగల్ అర్బన్: పారిశుద్ధ్య కార్మికులు, జవాన్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఈనెల 4, 5వ తేదీల్లో పారిశుద్ధ్య పనులు బంద్ చేస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతిపత్రం అందజేశారు.